## వేగవంతంగా ఎకో టూరిజం ప్రాజెక్టు పనులు

కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** ఎకో టూరిజం ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్ అన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు సమీపంలో ఎకో టూరిజం ప్రాజెక్టు కింద నిర్మాణంలో ఉన్న కాటేజీలు, లగ్జరీ సూట్లు, డీలక్స్ గదులను కలెక్టర్ పరిశీలించారు. సుమారు 9.90 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులో 7 డీలక్స్ గదులు, 10 సూట్ల నిర్మాణం జరుగుతుందని అధికారులు వివరించారు. పనులను వేగవంతం చేసి ఈ నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.పర్యాటక శాఖ డిప్యూటీ ఇంజనీర్ స్పందిస్తూ గడువులోపు ఈ పనులను పూర్తి చేస్తామని తెలిపారు.

## సమర్థవంతంగా ఓటర్ల జాబితా సవరణ

అదనపు కలెక్టర్ రాములు



**ప్రజాపక్షం/చెన్నూర్ :** జిల్లాలో చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వి.రాములు అధికారులను ఆదేశించారు. గురువారం చెన్నూర్ పట్టణంలోని 191వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి బూత్ స్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను త్వరగా పూర్తి చేసి బిఎల్ఓ యాప్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. బూత్ స్థాయి ఏజెంట్ల సహకారంతో సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం చెన్నూర్ లోని ఎంఎల్ఎస్ పాయింట్ గోదామును తనిఖీ చేసి ధాన్యం లోడింగ్, పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. గోదాము నుండి ధాన్యం పంపిణీని వేగవంతం చేసి వీలైనంత త్వరగా రేషన్ డీలర్లకు చేరేలా చర్యలు తీసుకోవాలని, ప్రజలు ఇబ్బందులు పడకుండా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ తహసిల్దార్ మల్లికార్జున్, పౌర సరఫరాల శాఖ అధికారులు, స్టేజ్ 2 గుత్తేదారు పాల్గొన్నారు.

## విద్యాసంస్థలపై దాడి చేస్తే క్రిమినల్ కేసులు



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** విద్యాసంస్థలు అనుమతి లేకుండా పాఠశాలలోకి ప్రవేశించి దాడులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీపీ సాయిచైతన్య హెచ్చరించారు. ఈ మేరకు ఓ పత్రిక ప్రకటనను గురువారం విడుదల చేశారు. పోలీస్ కమీషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ల పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్టాన్ని కొన్ని విద్యార్థి సంఘాలు తమ చేతిలోకి తీసుకుని స్కూల్స్, కాలేజీలలో ప్రవేశించి అలజడి సృష్టిస్తున్నారని సీపీ ప్రకటనలో పేర్కొన్నారు. ఏ౦ కొన్ని వసతులు లేవని, పుస్తకాలు అమ్ముతున్నారనే కారణాలతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, విద్యాసంస్థలను ఇబ్బందులకు, బెదిరింపులకు పాల్పడుతున్నారని, వివిధ సమస్యలపై విద్యాసంస్థలపై నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాని సీపీ సాయిచైతన్యయ హెచ్చరించారు.విద్యాసంస్థలకు ఏవైనా సమస్యలున్నట్లయితే వాటిపై సంబంధిత జిల్లా అధికారులకు లేదా విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయాలని సమస్యలపై అధికారులకు నిబంధన ప్రకారం విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటారని తెలిపారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం స్కూల్స్, కాలేజీలు ఎవరు కూడా బంద్ చేయించరాదని విద్యాసంస్థలను బంద్ చేసినట్లయితే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

## ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగి నిర్మాణం

జిల్లా సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు చంద్రం కృష్ణ గౌడ్

**ప్రజాపక్షం/కౌడిపల్లి :** రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు చంద్రం కృష్ణ గౌడ్ అన్నారు. గురువారం మెదక్ జిల్లా కౌడిపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగి నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు.ఇందిరా క్రాంతి పథకం ద్వారా కౌడిపల్లి గ్రామానికి ఆహార ధాన్యాల నిల్వ గిడ్డంగి మంజూరు కావడం హర్షణీయమన్నారు. మహిళా సంఘాలు, రైతులు పండించిన ధాన్యాన్ని శాస్త్రీయంగా, భద్రంగా నిల్వ చేసుకునేందుకు ఈ గిడ్డంగి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. రైతులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తూ వారి ఆదాయాన్ని పెంచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. మండల కేంద్రం లోని మల్లన్న ఆలయం వెనుకనున్న ప్రభుత్వ స్థలంలో పంచాయతీరాజ్ శాఖ డివిజనల్ ఇంజినీర్ అమరేందర్‌తో కలిసి గిడ్డంగి నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ డిఈ అమరేశ్వర్, ఏఈ మారుతి, కురుమ సంఘం మండల అధ్యక్షుడు కురుమ లక్ష్మణ్ యాదవ్, కౌడిపల్లి గౌడ సంఘం అధ్యక్షుడు చంద్రం కిషోర్ గౌడ్, ఉపసర్పంచ్ శ్వేతా మల్లికార్జున గౌడ్, వార్డు సభ్యులు రాజిరెడ్డి, మంగళపర్తి సందీప్ కుమార్, మక్బుల్, సింగూరి దేవేంద్ర కుమార్, రమేష్ నాయక్, శరత్, జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రాగుల భూమయ్య పటేల్, పుండరీకం గౌడ్, సత్యనారాయణ గౌడ్, రమేష్ గౌడ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తిరుమలేష్, యాదవ సంఘం నాయకుడు గోపాల్ యాదవ్, గ్రామసభ అధ్యక్షురాలు పున్నమ్మ, గ్రామ మండల సమైక్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా సిమెంట్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా ఎస్. విలాస్

తదుపరి జాతీయ మహాసభలు చత్తీస్‌గఢ్‌లో

**ప్రజాపక్షం/ఆదిలాబాద్ రూరల్:** ఆల్ ఇండియా సిమెంట్ ఫెడరేషన్ అత్యవసర సమావేశం న్యూఢిల్లీలోని ఏఐటియుసి కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ నూతన అడ్‌హాక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆల్ ఇండియా సిమెంట్ ఫెడరేషన్ జాతీయ ఉపాధ్యక్షులుగా ఎస్ విలాస్ ఎన్నికయ్యారు.ఫెడరేషన్ కార్యకలాపాలను వివరిస్తూ ఎస్ విలాస్ ప్రసంగించారు. పాత ఒప్పందం రద్దయినందున, ఏఐటియుసి సిమెంట్ ఫెడరేషన్ ద్వారా 'సిమెంట్ మాన్యుఫ్యాక్చరింగ్ అసోసియేషన్'కు తక్షణమే నూతన చార్టర్ ఆఫ్ డిమాండ్స్ పంపాలని తీర్మానించారు. కనీస ప్రాథమిక వేతనం రూ.50,000 ఉండాలని, ప్రతి సంవత్సరం బేసిక్ వేతనంపై 10 శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిమెంట్ పరిశ్రమలోని కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, సివిల్ కార్మికులందరికీ జాతీయ ఒప్పందాన్ని వర్తింపజేయాలన్నారు. కార్మికులందరికీ డస్ట్ అలవెన్స్, హీట్ అలవెన్స్, ఉచిత నివాస గృహాలు, మెడికల్ రీయంబర్స్‌మెంట్, సబ్సిడీ కాంటీన్, రక్షణ పరికరాలు కల్పించాలని కోరారు. నూతన ఒప్పందం ప్రతి మూడు సంవత్సరాలకే ఉండాలని, బకాయిలను ఒకే విడతలో చెల్లించాలని స్పష్టం చేశారు. ఆల్ ఇండియా సిమెంట్ ఫెడరేషన్ తదుపరి జాతీయ మహాసభలను చత్తీస్‌గఢ్ రాష్ట్రంలో నిర్వహించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

## విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధి...

# 'ఆరోగ్య పాఠశాలే'లక్ష్యం





**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్యం, విద్య, భద్రత, వ్యక్తిత్వ వికాసమే లక్ష్యంగా 'ఆరోగ్య పాఠశాల' కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. బజార్‌హత్నూర్ మండల కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలలో గురువారం నిర్వహించిన మూడవ విడత ఆరోగ్య పాఠశాల కార్యక్రమానికి ఆయన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లేపూల నర్సయ్యలతో కలిసి హాజరయ్యారు. నాయకులతో కలిసి కలెక్టర్ 'పాక్సో క్యాలెండర్'ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సమస్యలను నిర్భయంగా చెప్పుకునేందుకు పాఠశాలల్లో 'ఫిర్యాదుల పెట్టెలను' ఏర్పాటు చేస్తున్నామని, వాటిని ప్రతి నెలా ఒకటో తేదీన తెరిచి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తామన్నారు. ఈసారి జిల్లా నుండి ట్రిపుల్ ఐటీ బాసరాకు రికార్డు స్థాయిలో 67 మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ తల్లి దండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల ఆరోగ్య రక్షణకు అన్ని కేజీబీవీ, మోడల్ స్కూళ్లో మంచినీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు.బజార్‌హత్నూర్ మండలం గిర్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో రూ 1.20 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను జిల్లా కలెక్టర్ రాజర్షి షా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ గురువారం కలిసి పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తు న్న తమ కల సాకారమయ్యేలా గ్రామానికి బ్రిడ్జి మంజూరు చేయించినందుకు కలెక్టర్, ఎమ్మెల్యేలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపి శాలువాలతో ఘనంగా సన్మానించారు. మహేందర్ రెడ్డి, రాంకిషన్, సర్పంచ్ సాయన్న, ప్రిన్సిపాల్ సంగీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా భూ సర్వే ప్రక్రియ

కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాపక్షం/భీమారం :** ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జిల్లాలో భూ సర్వే ప్రక్రియను నిబంధనల ప్రకారం పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని మద్దికల్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రికార్డులు, మోకా, పట్టాదారుల వివరాలను పరిగణలోకి తీసుకొని నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై చర్యలు ఉంటాయని, సర్వే సమగ్రంగా నిర్వహించి మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా పూర్తి చేస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టికాహారం, శుద్ధమైన తాగునీరు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకం కింద సాగుతున్న నీటి ట్యాంక్, పైపు లైన్ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలని సూచించారు. భీమారం తహసిల్దార్ సదానందం, మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## అక్రమ ఇసుక డంపుల సీజ్



**ప్రజాపక్షం/రామాయంపేట:** రామాయంపేట పట్టణంలో అక్రమంగా నిల్వ ఉంచిన ఇసుకపై అధికారులు ఉక్కుపాదం మోపారు. ఎటువంటి అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గుట్టలుగా పోసిన మూడు బారీ ఇసుక డంపులను గురువారం రెవెన్యూ, మైనింగ్ అధికారులు సంయుక్తంగా దాడి చేసి సీజ్ చేశారు. సీజ్ చేసిన ఇసుకను తహశీల్దార్ కార్యాలయానికి తరలించినట్లు తహశీల్దార్ రజనికుమారి తెలిపారు. ఇసుకను తరలిస్తున్న మరో టిప్పర్ వాహనాన్ని అదికారులు సీజ్ చేశారు. గత కొంత కాలంగా రామాయంపేట పట్టణంలో అక్రమ ఇసుక వ్యాపారం జరుగుతున్నప్పటికి అధికారులు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

## ప్రభుత్వ ఆసుపత్రులల్లో వైద్యారోగ్య సేవలు మెరుగుపర్చాలి

కలెక్టర్ కె. హరిత

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ ఆసుపత్రులలో వైద్యారోగ్య సేవలు మెరుగుపడాలని కలెక్టర్ కె. హరిత అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలోని పాలనాధికారి ఛాంబర్‌లో వైద్యారోగ్య శాఖ అధికారులు, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, ఆసుపత్రి సూపరింటెండెంట్‌లతో నిర్వహించిన సమీక్షా సమావేశానికి సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఉట్నూరు ప్రాజెక్టు అధికారి మందా మకరందుతో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్లు, ఫార్మసిస్ట్‌లు, ఏఎన్ఎంల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్షాల దృష్ట్యా నెలలు నిండిన గర్భిణీలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ఆసుపత్రులలో అవసరమైన పరికరాలు, మందుల నిల్వలను అందుబాటులో ఉంచాలన్నారు. రోగులను ఆసుపత్రులకు తరలించడానికి అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచాలని, వైద్య సిబ్బంది సమయపాలన పాటించి ఆసుపత్రులకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. జిల్లా వైద్య సేవలు మెరుగుపడేలా వైద్య కళాశాలలో ఖాళీలను భర్తీ చేయుటకు నోటిఫికేషన్‌ను విడుదల చేయాలని, వైద్య



విద్యార్థులను బోధించడానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియమకానికి చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఆసుపత్రిలో మృతదేహాలను తరలించడానికి పార్థివ వాహనం ఏర్పాటు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి సీతారాం, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ వెంకట్, ఉప వైద్యాధికారి నాగేంద్ర పాల్గొన్నారు.

# కస్తూర్బా బాలికల విద్యాలయం ఆకస్మిక తనిఖీ

- అపరిశుభ్రతపై మండిపడ్డ కలెక్టర్
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదు
- విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యత
- కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** కస్తూర్బా పాఠశాల ఆవరణలో అపరిశుభ్రతపై కలెక్టర్ ఇలా త్రిపాఠి మండిపడ్డారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. విద్యార్థుల భద్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. రెజంల్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేసి పాఠశాలలోని పరిసరాలను, కిచెన్, స్టోర్ రూమ్ డైనింగ్ హాల్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాలు పిచ్చిమొక్కలతో నిండి అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులు పాములు, విష కీటకాల బారిన పడితే ఎవరు బాధ్యులని నిలదీశారు. వర్షపునీరు నిల్వ ఉన్న గుంతలలో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా ఇబ్బందులుంటే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బాలికలకుఆరోగ్య పరీక్షలు జరిపించాలని ఆదేశించారు.వంటగది, డైనింగ్ హాల్, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. తహసీల్దార్ శ్రవణ్, ఎంపిడిఓ కమలాకర్, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ శ్యామల తదితరులున్నారు.

## సిఎం విదేశీ విద్యా పథకం దరఖాస్తుల గడువు పొడిగింపు

మైనార్టీల సంక్షేమ శాఖ అధికారి వెంకటేశ్వరరావు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో ఉన్న పేద ,మైనార్టీ విద్యార్థుల కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి విదేశీ విద్యా పథకం (స్ప్రింగ్ సెషన్ 2026 కు దరఖాస్తు చేసుకునే గడువును జులై15,2026 సాయంత్రం 5.00 గంటల వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ శాఖ అధికారి డి. వెంకటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫథకం కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ప్రభుత్వం ఎంపిక చేసిన విదేశీ విశ్వవిద్యాలయాల్లో 2026 జనవరి 1 నుంచి 30 మద్యకాలంలో అడ్మిషన్ పొందిన వారు అయి ఉండాలని ఆయన పేర్కొన్నారు. అర్హత ఆసక్తి గల మైనార్టీ విద్యార్థులు జులై 15 సాయంత్రం 5.00 గంటలలోపు అధికారిక వెబ్ సైట్ www. telanganaepass .cgg .gov in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చని సూచించారు. అర్హులైన మైనార్టీ విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్నీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు రావాలని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి డి. వెంకటేశ్వరావు సూచించారు.

## విదేశీ ఉద్యోగమేళాకు విశేష స్పందన

ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** జిల్లా శిక్షణ ఉపాధి కల్పన శాఖ ఆధ్వర్యంలో టామ్‌కామ్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన విదేశీ ఉద్యోగమేళా, జాబ్ మేళాకు విశేష స్పందన లభించింది. గురువారం స్థానిక వర్ని చౌరస్తా సమీపంలోని జనార్ధన్ గార్డెన్‌లో నిర్వహించిన జాబ్‌మేళాకు ఐదు వేల పైచిలుకు మంది యువత తరలివచ్చారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి, నగర మేయర్ ఉమారాణి, ఉపాధి కల్పన డైరెక్టర్ కాంతి వెస్లీ, కలెక్టర్ ఇలా త్రిపాఠి తదితరులు జాబ్‌మేళాను సందర్శించారు. వివిధ కంపెనీలలో ఉద్యోగాల కోసం ఎంపికైన వారికి నియామక పత్రాలు అందజేసి ఎమ్మెల్యే మాట్లాడారు. విదేశాల్లో ఉద్యోగాలు చేయడానికి ఎలాంటి భయాందోళన చెందవద్దని, ప్రభుత్వం ప్రవాస భారతీయుల సంక్షేమానికి పెద్దపీఠ వేస్తుందన్నారు. గల్ఫ్ కార్మికుల సంఘం కోసం ప్రభుత్వం కొత్త పాలసీ రూపొందించనుందని తెలిపారు.జాబ్‌మేళాలో ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లా ఉపాధి కల్పనాధికారి వేల్పూల విజేత, జిల్లా యువజన, క్రీడల అభివృద్ధి అధికారి పవన్‌కుమార్, ఎఎంసి చైర్మన్ ముప్ప గంగారెడ్డి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు

కలెక్టర్ ప్రతిమా సింగ్



**ప్రజాపక్షం/మెదక్ :** మెదక్ జిల్లాలో యాసంగికి సంబంధించి సంపూర్ణంగా వరి ధాన్యం కొనుగోలు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ధాన్యం కొనుగోలు విజయవంతం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.మెదక్ జిల్లా చరిత్రలో జిల్లాలో రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేశామన్నారు. సంపూర్ణంగా ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది యాసంగిలో గతంలో కంటే 1.08 లక్షల మెట్రిక్ టన్నులు అత్యధికంగా రైతులు దిగుబడులు పండించారని, జిల్లాలో 4,28,361 లక్షల మెట్రిక్ టన్నులు సేకరణ పూర్తి అయిందన్నారు. రైతుల అకౌంట్లలో రూ.1005.66 కోట్ల రూపాయలు జమ చేశామన్నారు. 1,01,752 మంది రైతుల నుంచి ధాన్యం సేకరణ చేసి ఏప్రిల్ 08 న ప్రారంభమైన ధాన్యం కొనుగోళ్లు జూన్ 27వ తేదీకి పూర్తి చేశామన్నారు. జిల్లాలో మొత్తం 533 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ 305, ఐకేపీ185, డీసీఎంఎస్43 కేంద్రాల్లో కొనుగోలు జరిపామన్నారు. జిల్లాలో జొన్న రైతులు ఎలాంటి ఆందోళన గురి కావద్దని, జొన్నల కొనుగోళ్ల గురించి సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దని జిల్లా కలెక్టర్ రైతులకు సూచించారు. శుభ్రంగా ఉన్న జొన్నల్ని కొనడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 3609 ముందు రైతుల నుండి 6347 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసామన్నారు.

# 'పోక్సో' అత్యాచార కేసుల్లో మహిళలు,చిన్నారుల రక్షణే లక్ష్యం

జిల్లా ఎస్‌పి పరితోష్ పంకజ్




**ప్రజాపక్షం/సంగారెడ్డి :** తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం డీజీపి ఆదేశాల మేరకు సంగారెడ్డి జిల్లా భరోసా సెంటర్ ఆధ్వర్యంలో పోక్సో అత్యాచార కేసుల్లో మహిళలు ,చిన్నారుల రక్షణకు సమగ్ర సేవలు అందించడంతో పాటు వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశ్యంతో జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా స్థాయి స్టిక్ హోల్డర్స్ కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు ,చిన్నారులపై జరిగే నేరాల్లో బాదితులకు అన్ని రకాల సేవలను ఒకే వేదికపై అందించడంతో పాటు బాదితులు మళ్లీ మానసికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా రీ విక్టిమైజేషన్ జరగకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. అలాగే భాదితులకు అవసరమైన ట్రామా హిల్సింగ్ కౌన్సిలింగ్ పునరావాస సేవలు సమర్థవంతంగా అందించడం అత్యంత ముఖ్యమని తెలిపారు. వివిధ శాఖలు నిర్వహిస్తున్న సేవలు పోక్సో అత్యాచార కేసుల బాదితులకు మరింత సమర్థవంతంగా చేరేలా పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భరోసా సెంటర్‌లో మెడికల్ ఆఫీసర్‌ను నియమించాల్సిన అవసరం వైద్య పరీక్షల నివేదికల నాణ్యతను మెరుగుపరచడం చైల్డ్ వెల్ఫేర్, కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలను భరోసా సెంటర్‌లో నిర్వహించే ప్రతిపాదన విక్టిమ్ కాంపెన్సేషన్ పెండింగ్ కేసుల పురోగతి చదువు మధ్యలో మానేసిన బాదిత బాలికలకు ఏలాంటి వివక్ష లేకుండా తిరిగి పాఠశాలలు ,కళాశాలల్లో ప్రవేశాలు కల్పించడం వివిధ శాఖల మధ్యసమన్వయాన్ని బలోపేతం చేయడం పోక్సో చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి కీలక అంశాలపై సమావేశంలో చర్చించారు. అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి మాట్లాడుతూ పోక్సో ,అత్యాచార కేసుల్లో మహిళలు చిన్నారులు రక్షణ ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పరస్పర సమన్వయంతో పనిచేస్తే బాదితులకు త్వరితగతిన న్యాయం వైద్య సహాయం కౌన్సిలింగ్ న్యాయ సహాయం ,పునరావాస సేవలు సమర్థవంతంగా అందుతాయని తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న వివిధ శాఖాల ప్రతినిధులు తమ శాఖల ద్వారా అందిస్తున్న సేవలను వివరించి పోక్సో అత్యాచార కేసుల బాధితులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు విలువైన సూచనలు చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తే బాదితులకు వేగవంతమైన నాణ్యమైన సేవలు అందించవచ్చని సమావేశంలో అభిప్రాయపడ్డారు. డిఎల్‌ఏ సౌజన్య జిల్లా వైద్య ఆరోగ్య అదికారి లలితాకుమారి, వైద్య అధికారులు చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ రాజారెడ్డి, ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సూర్‌రెడ్డి, సత్యనారాయణ, జిల్లా సంక్షేమ అదికారి లలిత కుమారి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ జ్యోతి , డిఎస్పీలు వెంకట్‌రెడ్డి ప్రభాకర్, భరోసా సెంటర్ కో–ఆర్డినేటర్ పి.దేవలక్ష్మి ,భరోసా సెంటర సిబ్బంది పోలీసు అధికారులు,ఇతర లైన్ డిపార్టమెంట్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన కిరాణా వ్యాపారి పంచెర్పుల శ్రీనివాస్ రోడ్డు ప్రమాదంలో మృతి చెం దారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, శ్రీనివాస్ బుధవారం సాయంత్రం స్కూటీపై జన్నారం వెళ్లి తిరిగి వస్తుండగా ఫణీంద్ర ఆటోమొబైల్ సమీపంలోని కల్వర్టు వద్ద ప్రమాదం జరిగింది. రేండ్లగూడ వైపు ఇనుప రాడ్లతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రాలీని దాటే క్రమంలో వెనుక టైరు స్కూటీని ఢీకొట్టింది. ఎదురుగా అతి వేగంగా వచ్చిన ఆటో కూడా ఢీకొనడంతో శ్రీనివాస్ రోడ్డుపై పడి తీవ్ర గాయాలపాలయ్యారు. క్షతగాత్రుడిని 108 అం బులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి,ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృ తుడి భార్య పంచెర్పుల రజిత ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ బొడ్డు రవి, ఆటో డ్రైవర్ కొట్టే మొగిలిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



